క్లుప్తంగా

రేపటి నుంచి వైకుంఠ ఏకదశి ఉత్సవాలు


కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి

అల్లాదుర్గం(మెదక్): ఈ నెల 8 నుంచి 10 వరకు అల్లాదుర్గం వేంకటేశ్వర దేవాలయంలో వైకుంఠ ఏకదశి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితుడు ప్రవీణ్‌శర్మ సోమవారం తెలిపారు. 8న సుదర్శన హోమం, అభిషేకం, 9న శ్రీనివాస కల్యాణం, 10న ఉత్తర ద్వార దర్శనం, గరుడ సేవ ఇతర కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ప్రజల్లో భక్తిభావం పెరగాలి

మాధవనంద స్వామి


కేదారీశ్వర ఆలయంలో మాధవనంద స్వామి

పాపన్నపేట(మెదక్): భక్తి వ్యక్తి జీవన గమనాన్ని నిర్దేశిస్తుందని రంగంపపేట పీఠాధిపతి మాధవనంద స్వామి అన్నారు. సోమవారం ఆయన నాగ్సాన్‌పల్లి లో కేదారీశ్వరస్వామి ఆలయంలో నెలవారీ పూజలు నిర్వహించారు. ప్రతీవ్యక్తి భక్తిమార్గాన్ని అనుసరించాలని, తద్వార మానసిక ప్రశాంతత పొందగలుగుతాడని చెప్పారు. అనేక సమస్యలకు దైవ చింతన మార్గాన్ని చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఏడుపాయల మాజీ చైర్మన్ పార్శి నర్సింహులు, శ్యాం పంతులు, శంకరశర్మ, నాగ్సాన్‌పల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తపస్ కృషి చేస్తుందని తపస్ మండల అధ్యక్షుడు రవి అన్నారు. సోమవారం ఎంఈఓ వెంకటేశం, ఉపాధ్యాయులతో కలిసి ఆయన నూతన తపస్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, విఠల్, విజయ్‌కుమార్, తపస్ మండల ప్రధాన కార్యదర్శి కాన్షీరాం జాదవ్, ఉపాధ్యాయులు సుధీర్, రాధిక, భారతి, ప్రవీణ్ కుమార్, అనిత, అశ్విని, మారుతి, సిద్ధి రాములు, భాస్కర్, దయానంద్, హరీశ్, సౌజన్య, లక్ష్మి, బేతయ్య, సాయ గౌడ్, రాధాకృష్ణ, పుష్పలత, సంపూర్ణ పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా మల్లేశ్


నియామక పత్రం అందుకుంటున్న మల్లేశ్

పాపన్నపేట(మెదక్): బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన నీరుడి మల్లేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీసీలలో ఐకమత్యం తీసుకొచ్చి, రాజకీయ అవగాహన కల్పించడానికి కృషి చేస్తానన్నారు. జనాభాకు అనుగుణంగా అన్ని పార్టీలు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీసీలు ఏకతాటిపైకి వచ్చి, ప్రజాసేవకు ముందుకు రావాలని కోరారు. తనకు అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు నోముల శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం


ప్రవీణ, ప్రిన్సిపాల్

రేగోడ్(మెదక్): స్థానిక మోడల్ స్కూల్‌లో 2025–26 సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ కోరారు. సోమవారం జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9 , 10వ తరగతిలోని ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు, కళాశాల స్థాయిలో ఎంసెట్, నీట్ వంటి కోచింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 3న హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ 13 పరీక్ష ఉంటుందని చెప్పారు.

● రైతుభరోసా కోతపై నిరసన



రైతు భరోసాలో కోత వేయడంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు చిన్నశంకరంపేట మండల కేంద్రంలో సోమవారం రాస్తారోకో నిర్వహించారు. మెదక్–చేగుంట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతుభరోసా రూ.15 వేలు అందించాలని డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరేషన్ సభలో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు.

– చిన్నశంకరంపేట(మెదక్)

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

శివ్వంపేట గ్రామస్తుల వినతి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామంలో తాగు నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. సోమవారం శివ్వంపేట పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రమాదేవి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని, గ్రామంలో నిర్మించిన సంపులో బూస్టర్ మోటార్ ఏర్పాటు చేసి రక్షిత వాటర్ ట్యాంకుల్లోకి నీరు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అవసరం ఉన్న చోట్లలో బోరు బావుల్లో మోటార్లు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

● 108 సేవలు అందుబాటులోకి..



నిజాంపేట మండలానికి మంజూరైన నూతన 108 వాహనాన్ని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సోమవారం ప్రారంభించారు. నిజాంపేట మండలంలో ప్రమాదాలు జరిగినప్పుడు లేదా అత్యవసర పరిస్థితి తలెత్తితే.. సంఘటన స్థలానికి 108 చేరుకోవాలంటే 30 నిమిషాలు సమయం పడుతోందని, దీనిని అధిగమించడానికే వాహనం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

– నిజాంపేట(మెదక్)

గ్యారంటీల అమలులో ప్రభుత్వం వైఫల్యం

- ఎమ్మెల్యే సునీతారెడ్డి
- ఆరు గ్యారంటీల ఫ్లెక్సీతో శవయాత్ర


ఫ్లెక్సీని బొందపెడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్ఎస్ నేతలు

నర్సాపూర్ రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసే విషయంలో ప్రభుత్వానికి చేతకావడం లేదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర అధిష్టానం పిలుపుమేరకు ఆమె ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీల ఫ్లెక్సీతో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుంచి చౌరస్తా వరకు బీఆర్ఎస్ నాయకులు శవయాత్ర నిర్వహించి చౌరస్తాలో గోతిని తీసి పాతిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలను ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క హామీని నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. రైతులకు ఎకరాకు రూ.15 వేల రైతు భరోసా, కౌలు రైతులకు రూ.12వేలు, మహిళలకు రూ.2500, వృద్ధుల పెన్షన్ రూ.4వేలు, దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు, విద్యార్థులకు, ఆటో కార్మికులకు ఇచ్చిన ఏ హామీని అమలు చేయడం లేదన్నారు. ఖజానా లోటు పేరుతో బీఆర్ఎస్‌ను బద్నాం చేస్తూ కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చే చేతకాని ప్రభుత్వం ఆయా ఆరోపణల పేరుతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులపై కేసులు బనాయిస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తే వారి చేతగాని ప్రభుత్వాన్ని అడిగేవారు ఉండాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవేందర్ రెడ్డి, చంద్రగౌడ్, మన్సూర్, హరికృష్ణ, నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమ్, పట్టణ అధ్యక్షుడు పంబల్ల భిక్షపతి, సత్యం గౌడ్, ఆంజనేయులు గౌడ్, రామచందర్, నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి తరలివచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు


గంపలతో ఊరేగింపుగా తరలి వెళ్తున్న యాదవ సంఘం మహిళలు

నర్సాపూర్ పట్టణంలో వెలిసిన మరకత మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, అభిషేకం, అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తుల తరలివచ్చి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. తొలుత యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆలయం వరకు గంపలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోతరాజుల విన్యాసాలు అలరించాయి. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డితో పాటు ఆయా పార్టీల నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా ఒగ్గు కళాకారుల ప్రదర్శన, సాయంత్రం బోనాల ఊరేగింపు కనులపండువగా జరిగింది.

కార్యకర్తలు సైనికులుగా మారాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్


మాట్లాడుతున్న శంకర్

నిజాంపేట(మెదక్): భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం సామాజిక న్యాయ, ప్రచార సైనికులుగా డీబీఎఫ్ కార్యకర్తలుగా మారాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ పిలుపు ఇచ్చారు. సోమవారం మండల కేంద్రంలో సంఘంకార్యకర్తల సమావేశంతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవంతో జీవించేందుకు ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. రాజ్యాంగం, హక్కులు, చట్టాలు, పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వాటిని దళిత బహుజనుల దరి చేర్చాలన్నారు. తొలుత నిజాంపేట డీబీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్యాగరి చంద్రం, మండల గౌరవాధ్యక్షుడిగా కొమ్మాట రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా తోటమీది చంద్రం, ఉపాధ్యక్షులుగా మనుబోతు శ్రీనివాస్, ఎండీ యాకోబ్, కార్యదర్శిగా నరేశ్, కోశాధికారిగా రాజు, కమిటీ సభ్యులుగా బ్యాగరి రాజు, శ్రీనివాస్, బాలరాజు, కిషన్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చేయూత


వీరప్ప కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న పోలీసులు

రేగోడ్(మెదక్): హెడ్ కానిస్టేబుల్ వీరప్ప ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. అతని కుటుంబానికి తోటి పోలీసులు ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రమైన రేగోడ్ గ్రామానికి చెందిన నాగప్పగారి వీరప్ప 1992వ పోలీస్ బ్యాచ్. ఆయనతో ఉన్న స్నేహంతో బాధిత కుటుంబానికి భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో తోటి పోలీసులు రవీందర్, రాములు, రఘునాథ్ సింగ్, రవి, శ్రీకాంత్ తదితరులు రూ.లక్ష 45 వేల చెక్కు అందజేశారు. మృతిచెందిన తోటి పోలీసు కుటుంబానికి అండగా నిలబడటం పట్ల పోలీసులను స్థానికులు అభినందిస్తున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకట్రావుపేట, రాజిపేట సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సాయికుమార్ తెలిపారు. నర్సాపూర్ సబ్‌స్టేషన్ నుంచి లింక్‌లైన్ పనులు జరుగుతున్నందున రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కరాటేలో ప్రతిభ



కౌడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు కరాటేలో ప్రతిభ కనబరిచారు. ఇటీవల మెదక్‌లో జరిగిన కరాటే పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థినులకు కటాస్ విభాగంలో శ్వేత, లావణ్య, అశ్విని, వందనకు బంగారు పతకం, సుమిత్రకు వెండి పతకం, సంజన కాంస్య పతకం పొందారు. ఆ మేరకు వారిని హెచ్‌ఎం సాజిద్‌అలీతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

– కౌడిపల్లి(నర్సాపూర్)

ఆ కుటుంబాలను ఆదుకుంటాం

ఎమ్మెల్యే రోహిత్‌రావు

రామాయంపేట(మెదక్): ప్రభుత్వపరంగా మృతుల కుటుంబాలను ఆదుకుంటామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని రాయిలాపూర్, ఝాన్సిలింగాపూర్ గ్రామాల్లో ఇటీవల గజం చంద్రం, ఆంజనేయులు మృతిచెందగా వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. అంతకుముందు రామాయంపేట, అక్కన్నపేటలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను అందజేశారు. పీసీసీ రాష్ట్ర కార్యదర్శి సుప్రభాతరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు దేమె యాదగిరి, సుందర్‌సింగ్, సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి, కోనాపూర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్‌లో..

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించారు. సుల్తాన్‌పూర్ గ్రామంలో నిమోనియా వ్యాధితో బాధపడుతూ చిన్నారి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. గాజిరెడ్డిపల్లి గడ్డం కిష్టయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరపున అండగా ఉండి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరుశురామ్‌గౌడ్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

ప్రజల భద్రతే మా లక్ష్యం

ఎస్‌ఐ పోచయ్య


రేగోడ్: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ పోచయ్య

రేగోడ్(మెదక్): ప్రజల భద్రతే మా లక్ష్యమని స్థానిక ఎస్‌ఐ పోచయ్య అన్నారు. రోడ్డు వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రమైన రేగోడ్‌లో సోమవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. పాటించవలసిన నిబంధనలు, చట్టం గురించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణం చేసే ముందు కొద్ది పాటి నిర్లక్ష్యం ఫలితంగా కుటుంబాలు రోడ్డు పాలవుతాయనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్‌తోపాటు అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఫోర్ వీలర్ నడిపే వ్యక్తులు సీటు బెల్ట్ ధరించాలని, వేగ పరిమితులను అనుసరించాలని చెప్పారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తం

పాపన్నపేట(మెదక్): సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పాపన్నపేట ఏఎస్‌ఐ గాలయ్య అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం యూసుఫ్ పేట ఉన్నత పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాకారులు ఆటపాటలతో రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, ఏటీఎం మోసాలు, మూఢనమ్మకాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సురేందర్ గౌడ్, హోంగార్డు ఇసాక్, హెచ్‌ఎం మాలతీదేవి, టీచర్లు పద్మ, శ్రీనివాస్, నర్సింహులు, కనకయ్య, హీరాలాల్, పవన్, రఫీక్, శ్రవణ్, రాజేందర్, వీరేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సౌలభ్యం కోసమే సంఘాలు

పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డి


సొసైటీ కార్యాలయంలో చైర్మన్, డైరెక్టర్లు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గ్రామాల రైతుల సౌలభ్యం కోసం, మండలంలో ఉన్న పీఏసీఎస్‌తోపాటు మరిన్ని ఏర్పాటు చేసుకునేందుకు తీర్మానించామని పీఏసీఎస్ సోమక్కపేట్ చైర్మన్ ధర్మారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సోమక్కపేట్ సొసైటీలో చైర్మన్, డైరెక్టర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ సక్రమంగా నడవాలంటే దీర్ఘకాలిక అప్పులు వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తయినందున, వాటికి సంబంధించిన లావాదేవీలు లెక్కలు పూర్తి చేయాలన్నారు. మండలంలో మరో రెండు సంఘాల ఏర్పాటుకు తీర్మానం చేశామన్నారు. అదేవిధంగా సొసైటీకి సంబంధించిన పెట్రోల్ బంక్‌ను త్వరలోనే పునర్ ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విఠల్, అంబర్‌సింగ్, సుభాశ్, యదాగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాడుబడిన బావులు పూడుస్తామని..

- మట్టి తరలింపు
- ఎదుల్లాపూర్ రైతులు ఆరోపణ


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): షేగల్ అనే స్వచ్ఛంద సంస్థ గ్రామంలో పాడుబడిన బావులను పూడుస్తామని రైతులను మోసం చేస్తుందని, ధర్మ చెరువులో మట్టి తవ్వకాలు జరిపి ఇతర ప్రాంతాలకు తరలిస్తోందని మండలంలోని ఎదుల్లాపూర్ రైతులు ఆరోపించారు. సోమవారం రైతులు కల్లూరి రాములు, పద్మయ్య, అశోక్‌రెడ్డి, వెంకటేశ్, సంతోశ్, శ్రీకాంత్, కృష్ణ తదితరులు ప్రొక్లెయిన్ ఎదుట నిరసన తెలిపారు. స్వచ్ఛంద సేవా ముసుగులో అక్రమాలకు పాల్పడిన వారిపై జిల్లా ఉన్నతధికారులు దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ చదవడం, రాయడం రావాల్సిందే



కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతీ విద్యార్థికి చదవడం రావడం రావాల్సిందేనని ఎంఈఓ బాలరాజు తెలిపారు. కౌడిపల్లి మండలం లింగంపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు బోర్డుపై పాఠాలు చెప్పి, పుస్తకాలను చదివించారు. ప్రతీవిద్యార్థికి చదవడం, రాయడం తోపాటు చతుర్విధ ప్రక్రియలు రావాలని చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి నాణ్యమైన విద్యబోధన చేయాలన్నారు.

◆ సామాజిక తనిఖీలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ గ్రామసభలను నిర్వహించారు. మండలంలోని భుజిరంపేట, రాయిలాపూర్, వెల్మకన్న, తిమ్మాపూర్, కంచన్‌పల్లి, ధర్మాసాగర్, కుషన్‌గడ్డతండా, సలాబత్‌పూర్, కొచ్చరుతండా, సదాశివపల్లి గ్రామాలలో గతేడాది ఉపాధి హామీ కింద చేసిన పనులను తనిఖీలు చేశారు.

◆ పరీక్షలకు సిద్ధం కావాలి

వెల్దుర్తి(తూప్రాన్): వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని మెదక్ ఇంటర్ విద్యాధికారి మాధవి విద్యార్థులకు సూచించారు. సోమవారం వెల్దుర్తి మండల కేంద్రంలోని రామయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రణాళిక ప్రకారం చదువుకోవాలన్నారు. కళాశాలకు రెగ్యులర్‌గా హాజరు రావాలని సూచించారు. అనంతరం ఉత్తీర్ణతపై ప్రత్యేక దృష్టిసారించాలని లెక్చరర్లకు సూచించారు. వారికి అవసరమైన మెటీరియల్ అందించాలన్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించి వారి సామర్థ్యం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపక బృందం ఉన్నారు.

◆ హరీశ్‌రావును కలిసిన నేతలు



మనోహరాబాద్(తూప్రాన్): ఎమ్మెల్యే హరీశ్‌రావును ఆయన నివాసంలో సోమవారం బీఆర్ఎస్ మండల నాయకులు ర్యాకల శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో కలిశారు. స్థానిక సమస్యలు, పార్టీ పదవులు, స్థానిక ఎన్నికల విషయంపై చర్చించారు. త్వరలోనే మండల నూతన కమిటీలను వేస్తామని, ప్రజల పక్షాన పోరాడాలని మాజీ మంత్రి సూచించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దాసరి నరేశ్, వెంకటేశ్, రాహుల్‌రెడ్డి, భిక్షపతి, రతన్‌లాల్, లక్ష్మణ్‌యాదవ్, తదితరులున్నారు.

◆ ఖోఖో జాబితాలను అందజేయాలి

సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లాలో మండలాల వారీగా ఖోఖో రిజిస్ట్రేషన్ చేసుకున్న జాబితాను అడాక్ కమిటీకి అందజేయాలని ఖోఖో ఉమ్మడి మెదక్‌జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ వై.మహేందర్రావు కోరారు. మండలాలు, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులతో రిజిస్ట్రేషన్ చేయించిన క్లబ్, సొసైటీల డాక్యుమెంట్లను ఖోఖో అడహక్ కమిటీ సభ్యుడు, చేగుంట మండలం వడియారం పాఠశాల పీడీ ఎస్.నాగరాజుకు అందజేయాలని ఆయన సూచించారు. వివరాలకు 9866546563 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

◆ మాజీ సర్పంచ్ మృతి

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం మాజీ సర్పంచ్ రంగాగౌడ్ (52) ఆదివారం రాత్రి మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఆయన ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. 2006–11 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మృతి పట్ల గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

◆ క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి: సంగారెడ్డిలో నీలి కుల సంఘం క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నీలి అంజయ్య మాట్లాడుతూ.. నీలి కుల సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు.